క్లుప్తంగా

మేరు కులస్తులను బీసీ-ఏలోకి చేర్చాలి



బాన్సువాడ : మేరు కులస్తులను బీసీ డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని బుధవారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయం ఏవోకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేరు కులసంఘం అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ మేరు కులస్తులకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేయాలని, బీసీ-డీలో ఉన్న మేరు కులస్తులను బీసీ ఏ లోకి మార్చాలని విన్నవించారు. మేరు కులస్తులు భాస్కర్, యాదవ్, వెంకటి, కోటి మహేష్ తదితరులున్నారు.

'మీసేవ కేంద్రాలను మినహాయించాలి'



ఎల్లారెడ్డి : ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణ సమయంలో జిరాక్స్ కేంద్రాలతో పాటు మీసేవ కేంద్రాలను మూసి వేయాలన్న నిబంధన నుంచి మీసేవ కేంద్రాలకు మినహాయింపు ఇవ్వాలని మీసేవా నిర్వాహకులు బుధవారం తహసీల్దార్ మహేందర్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. మీసేవ కేంద్రాలు ఉదయం12 గంటల వరకు మూసి ఉంచడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

నియామకం



లింగంపేట(ఎల్లారెడ్డి) : తెలంగాణ జానపద కళాకారుల మండల కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. లింగంపేట మండలం నల్లమడుగు గ్రామానికి చెందిన కొండ రాజులు అధ్యక్షుడిగా ఉపాధ్యక్షుడిగా పెంటయ్య, తమ్మి రాజులు, కాశీరాం, ప్రధాన కార్యదర్శి దాసరి సాయిలు, సంయుక్త కార్యదర్శులు రాజయ్య, రాజు, లక్ష్మీనారాయణ, కోశాధికారి రాపర్తి పెంటయ్య, ప్రచార కార్యదర్శి బాలయ్య, సలహాదారులు పోచయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి రాజయ్య, జిల్లా అధ్యక్షుడు ఉప్పల విశ్వనాథం ఆనందరావు, ప్రభులింగం, తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలన దినోత్సవం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులు 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు బోధించారు. పదో తరగతి శ్రీజన్ హెచ్‌ఎంగా వ్యవహరించారు. హెచ్‌ఎం శౌకత్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

నిలిచిన ఎంపీపీ అధ్యక్ష ఎన్నిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుని ఎన్నికపై హైకోర్టు స్టే విధించడంతో బుధవారం జరగాల్సిన ఎన్నిక ప్రక్రియను నిలిపేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరాస్వామి తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం బుధవారం అధ్యక్షుడి ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులకు కూడా నోటీసులను జారీ చేశారు. కాని అధ్యక్షుని ఎన్నిక నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో బుధవారం జరగాల్సిన ఎన్నిక ప్రక్రియను వారు నిలిపివేశారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



బాన్సువాడ : ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్‌రాములు మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే చెల్లించాలని, అప్పటివరకు పనులు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులు రేణుక, సురేఖ, రాజు, భారతి, సంగీత, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



గోపాల్‌పేట పరీక్షాకేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు



తాడ్వాయిలో..



తాడ్వాయిలో పరీక్ష సమయం దగ్గరపడడంతో పరుగులు తీస్తున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేట ఆదర్శ కళాశాలలో మొదటిరోజు ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించారు. ఆదర్శ కళాశాలకేంద్రంలో 191మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహాచారి తెలిపారు.

భిక్కనూరు : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్షలకు హాజరై విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుమతించారు. 234 మందికిగాను 231 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల గురుకుల పాఠశాల, లింగంపేట్ గురుకుల పాఠశాలకు చెందిన 226మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ యూసుఫ్ హుస్సేన్, డిపార్ట్‌మెంటర్ ఆఫీసర్‌గా నాగేశ్వర్, 10మంది ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణంలోని మోడల్ జూనియర్ కళాశాల, ప్ర.జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు సాయిబాబా, హేమచందర్ కేంద్రాలను పరిశీలించారు.

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌కు గాను 233 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు.

గాంధారి(ఎల్లారెడ్డి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గిరిజన గురుకుల, కస్తూర్బా గాంధీ కాలేజీ విద్యార్థులు పరీక్ష రాశారు. ఈ పరీక్షా కేంద్రంలో 232 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

బాన్సువాడ రూరల్ : బాన్సువాడ పట్టణంతో పాటు గ్రామీణలో మొత్తం 7 సెంటర్లు ఏర్పాటు చేశారు. జనరల్ విభాగంలో 1386 మంది, వొకేషనల్ విభాగంలో 764మంది పరీక్షలకు హాజరయ్యారు.

మద్నూర్/బాన్సువాడ : మద్నూర్‌లోని మండలంలోని పెద్దఎక్లార గేటు వద్ద బాలిక ల గురుకుల కళాశాలకు చెందిన సీఈసీ విద్యార్థి మ నీషా పరీక్షకు 10 నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. బాన్సువాడ పట్టణంలోని ప్ర.జూ.కళాశాలలో పరీక్ష కేంద్రానికిబండపల్లికి చెందిన విద్యార్థిని భాగ్య ఆలస్యంగా వచ్చారు.



నాగిరెడ్డిపేటలో..



భిక్కనూరులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

కౌన్సిలర్ దిష్టిబొమ్మతో నిరసన



కౌన్సిలర్ ఇంటి ముందు గుమ్మిగూడిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులు, ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ

● పార్టీ మారినందుకు ఇంటి ఎదుట హైడ్రామా

బాన్సువాడ : ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ రమాదేవి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాలనీ వాసులను ఆగ్రహానికి గురయ్యారు. పార్టీ మారిన కౌన్సిలర్ ఇంటి ఎదుట బుధవారం ఇరుపార్టీల నేతలు హైడ్రామా సృష్టించారు. కౌన్సిలర్ దిష్టిబొమ్మతో కాలనీవాసులు నిరసన వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్న 10వ వార్డు కౌన్సిలర్ రమాదేవి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే కాలనీవాసులకు ఒక్కమాట కూడా చెప్పకుండా పార్టీ మారడంతో ఆగ్రహించిన కాలనీవాసులు ఆమె దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకుని రమాదేవి మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, వైస్ చైర్మన్ జుబేర్‌లతో పాటు కొందరు బీఆర్‌ఎస్ నాయకులకు ఫోన్‌చేసి తనను అకారణంగా తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీలో చేర్పించారని చెప్పడంతో బీఆర్‌ఎస్ నాయకులు కౌన్సిలర్ ఇంటికి చేరుకున్నారు. విషయం తెసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున కౌన్సిలర్ రమాదేవి ఇంటికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్‌తో మీకేం పనంటూ కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకులను నిలదీశారు. ఇరుపార్టీల నాయకులు భారీగా కౌన్సిలర్ ఇంటికి చేరడంతో కొద్దిసేపు హైడ్రామా నడిచింది. దీంతో కౌన్సిలర్ రమాదేవి గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. విషయం పోలీసులకు తెలియడంతో రూరల్ సీఐ సత్యనారాయణ పోలీసులతో వచ్చి ఇరు పార్టీల నాయకులను అక్కడి నుంచి పంపించారు. కాలనీ వాసులు కొందరు రమాదేవి దిష్టిబొమ్మను ఆమె ఇంటి ముందు ఉంచి నిరసన వ్యక్తం చేశారు. నీడనిచ్చిన చెట్టుకు ద్రోహం చేసిన రమాదేవి అంటూ రాసిన కాగితాన్ని దిష్టిబొమ్మకు అంటించి నిరసన తెలిపారు.

పోచారం కాలువలో మోటార్లు వేస్తే చర్యలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పోచారం కాలువలో అక్రమంగా మోటార్లు పెట్టి నీటిచౌర్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పోచారం కాలువలో అక్రమంగా ఉన్న బోరు మోటార్ల కనెక్షన్లు తొలగించామన్నారు. స్టార్టర్ల వద్ద తీగలకు విద్యుత్ షాక్ తగిలేలా రైతులు బోరు మోటార్లు ఏర్పాటు చేశారని, కాలువపై నుంచి వెళ్లే వారికి ఇది నష్టం కలిగిస్తుందన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు కూడా దీనిని పర్యవేక్షించాలన్నారు. అక్రమంగా నీటి వినియోగం చేస్తున్న పలు మోటార్ల కనెక్షన్లు తొలగించడం జరిగిందన్నారు.

పంటల పరిశీలన



రాజంపేట : రాజంపేట మండలంల ఆర్గొండ, కొండాపూర్, సిద్దాపూర్ గ్రామాల్లో పంట పొలాలను బుధవార ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సుప్రజ్యోతి మాట్లాడుతూ ప్రధానంగా యాసంగి సీజన్లో వరి, మొక్కజొన్న, శనగ, కూరగాయ పంటలను ప్రధానంగా సాగు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా వరి పంటలో అక్కడక్కడ మోగి పురుగు (కాండం తొల్చు పురుగు) గమనించడం జరిగిందని మోగి పురుగు గమనించిన వెంటనే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఒక ఎకరానికి 810 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు 78 కిలోలు ఇసుకలో సమనంగా కలిపి సాయంత్రం వేళల్లో చల్లుకోవాలన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



భిక్కనూరు : బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్లను బుధవారం భిక్కనూరులో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు అంబల్ల సాయి నిఖిల్, బసగళ్ల సిద్దరాములు, సమల భరత్, రాజేందర్, నాగులు, భూమేశ్, లింగం, భీమయ్య, ఆంజేనేయులు, శ్రీకాంత్, శరత్, శ్రీధర్ పాల్గొన్నారు.

కిసాన్ ర్యాలీలో పాల్గొన్న నేతలు



భిక్కనూరు : హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఇసాన్ ర్యాలీలో భిక్కనూరు మండల నేతలు పాల్గొన్నారు. కుంట లింగారెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర నాయకుడు కోదండ రెడ్డిని కలిసినట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం



బీబీపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 31 మంది పదో తరగతి విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులకు గానూ అల్పాహారం అందజేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మెన్ నాగరాజ్‌గౌడ్, నందకుమార్ సొంత డబ్బులతో 20 రోజుల అల్పాహారం ఇచ్చేందుకు ముందుకొచ్చారు. హెచ్‌ఎం రామేశ్వర్ రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ మండల చైర్మెన్ నాగేశ్వర్, వైస్ చైర్మెన్ స్వామి ఉన్నారు.

అంత్యక్రియలకు విరాళాలు

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన బబ్బురి మైశయ్య (48) అనే వ్యక్తి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబీకులు, బంధువులు ఎవరూలేని అనాథగా ఉన్న మైశయ్య మృతి చెందగా గ్రామస్థులు తమకు తోచినంతగా డబ్బులు విరాళాలను అందజేశారు.

ఘనంగా సహస్ర ఘటాభిషేకం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ఉత్తునూర్‌లో ఖండేరాయ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం మంటప పూజ, ముఖ్య దేవత పూజ, హోమం, మధ్యాహ్నం మూలవిరాట్‌కు సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పార్శి శ్రీనివాస్ గుప్తా స్వగృహం వద్ద గల చేదబావి నుంచి కలశాల్లో నీటితో ఆలయ ప్రాంగణంలో ఘటాభిషేకం చేశారు. ఒగ్గుకథ ఆకట్టుకుంది. వీడీసీ,ఆలయ కమిటీ చైర్మన్ దొడ్లె రవి, వీడీసీ ప్రతినిధులు తదితరులున్నారు. నేడు ఆలయ వార్షికోత్సవాలకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు రానున్నట్లు నిర్వహకులు తెలిపారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



బాన్సువాడలోని పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు



తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో..



జీవదాన్ పాఠశాలలో..



సైన్స్‌ఫేర్‌లో గుజరాతీ వేషాధారణలో చిన్నారులు

అంతర్జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గాల్లోని ఆయా పాఠశాలల్లో బుధవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.
– సాక్షి నెట్‌వర్క్



ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బహుమతులందిస్తున్న ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్



సదాశివనగర్‌లో..



మద్నూర్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



జంగంపల్లి ఉన్నత పాఠశాలలో..



బీబీపేట టీఎస్‌ఎన్‌ఆర్ బాలుర పాఠశాలలో..



చిన్నమల్లారెడ్డిలో సీవీ రామన్‌కు విద్యార్థుల నివాళి

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ప్రధానంగా మండలంలోని పలు గ్రామాల్లో నీటిసమస్య గురించి సంబంధిత ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా మిషన్ భగీరథ అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానం బస్వన్నపల్లిలో నీటిఎద్దడి తీవ్రంగా ఉందని ఎంపీటీసీ సమలత సభాదృష్టికి తీసుకెళ్లగా దీనిపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టి నీటి సమస్య లేకుండా చూస్తామని ప్రత్యేకాధికారి సంతోషి, మిషన్ భగీరథ అధికారులు తెలిపారు. కొండాపూర్ గ్రామ పరిధిలో కొండాపూర్ పరిధిలో రోడ్డు పక్కన్న నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆరెపల్లి తండా పాఠశాల విషయం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఈవో రామస్వామిని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



బాన్సువాడలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీర్కూర్‌లో..

బాన్సువాడ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రూ.500 సిలెండర్, గృహజ్యోతి పథకం అమలు చేస్తున్న సందర్భంగా సీఎం చిత్రపటానికి బాన్సువాడ, బీర్కూర్‌లో క్షీరాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు మాసాని శేఖర్‌రెడ్డి, నాయకులు నార్ల రత్నకుమార్, కొత్తకొండ భాస్కర్, నార్ల సురేష్, నార్ల రఘు తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జంగంరాజు, శ్యాంరావు, షౌకత్‌అలీ, రాంచంద్రం, లక్ష్మణ్ తదితరులున్నారు.

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు సతీష్‌గౌడ్, మన్నె విఠల్, జనార్దన్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, టేకుల మొగులయ్య తదితరులున్నారు.

బిచ్కుంద(జుక్కల్) : మండలంలోని సీతరాంపల్లిలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, నాయకులు కమల్‌కిషోర్,. నాగ్‌నాథ్, గంగాధర్, సంజీవ్ దేశాయి పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : నిజాంసాగర్, మహమ్మద్‌నగర్, జుక్కల్ మండల కేంద్రాల్లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడ్వాయిలో..



మహమ్మద్‌నగర్‌లో..

సంక్షిప్తం

ముమ్మరంగా చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా సాగుతుంది. మంగళవారం నాటికి 3లక్షల 17వేల 741 మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావ్ తెలిపారు.

ఎల్లారెడ్డిలో ఫిజియోథెరపీ క్యాంప్

ఎల్లారెడ్డి: పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం అధికారులు ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. అంగవైకల్యం ఉన్న చిన్నారులకు ఫిజియోథెరపీ వైద్యులు అరుణ్ వైద్య పరీక్షలను నిర్వహించారు.

తాడ్వాయి బోరుబావి తవ్వకం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బుధవారం బోరుబావిని వేయించారు. బీసీకాలనీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు తాగునీటి ఎద్దడి విషయం వివరించగా నిధులు మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ నర్సింలు, కార్యదర్శి బాలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్నాసాగర్ సీసీ రోడ్డు పనులను గ్రామస్తులు బుధవారం ప్రారంభించారు. గ్రామంలో రూ. 15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గురుప్రతాప్, మాజీ జెడ్పీటీసీ గయాజుద్దీన్, మాజీ ఎంపీపీ చెన్న లక్ష్మణ్ ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం

బిచ్కుంద(జుక్కల్) : నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంతో ముందుకెళ్తామని సీనియర్ నాయకులు కమల్‌కిషోర్, వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం సీతారాంపల్లిలో సీసీరోడ్డు పనులు ప్రాంభించారు. గ్రామాల్లో రూ. 5 లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నామన్నారు. బిచ్కుందలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభించామన్నారు. పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, గంగాధర్, ప్రత్యేకాధికారి ఏడీ భాస్కరన్ పాల్గొన్నారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

కామారెడ్డి అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గురువారం ఉదయం 11 గంటలకు కామారెడ్డి జిల్లా భవనంలో హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సంఘం అధ్యక్షుడు నిట్టు విఠల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ గుర్తింపుకార్డుతో పాటు హెల్త్, ఆధార్‌కార్డులు వెంట తీసుకురావాలని విఠల్‌రావు సూచించారు.

గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మల్లుపేట్‌కు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ మంచాల రమేశ్‌యాదవ్ (45) మంగళవారం గుండెపోటు రావడంతో వెంటనే కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తూనే, సినిమాల్లో కథనాలను రాసి నిర్మాతగా వ్యవహరించి సినిమాలు పూర్తిచేశాడు. మృతునికి భార్య గంగాలక్ష్మి, కుమార్తె పవిత్ర, కుమారుడు అభి ఉన్నారు.

నేడు విజయ సంకల్పయాత్ర

నిజాంసాగర్(జుక్కల్) : బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్ర గురువారం జుక్కల్‌లో జరుగనుంది. జుక్కల్ మండలంలోని బాబుల్‌గావ్ గ్రామం నుంచి జుక్కల్, బిచ్కుంద మండలాల్లో యాత్ర సాగనుంది.